క్లుప్తంగా

ఆమ్ ఆద్మీ పార్టీకి కొవ్వూరు ఇన్‌చార్జ్ గుడ్‌బై

28న వైఎస్సార్ సీపీలో చేరనున్నట్టు ప్రకటన



విలేకరుల సమావేశంలో యంగల వరప్రసాద్

కొవ్వూరు: ఆమ్ ఆద్మీ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ యంగల వరప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఏఎస్సైగా పని చేసి రిటైరైన వరప్రసాద్ సొంతూరు మండలంలోని నందమూరు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. తనతో పాటు స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకుడు కె.సంతోష్‌కుమార్ కూడా రాజీనామా చేసినట్టు ప్రకటించారు. ఈనెల 28న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ సమక్షంలో తాము వైఎస్సార్ సీపీలో చేరతామని ప్రకటించారు. సామాజిక న్యాయం పాటించడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఆయనన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మారిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

8 మంది వలంటీర్ల రాజీనామా



తాళ్లపూడిలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న అన్నదేవరపేట వలంటీర్లు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట సచివాలయం పరిధిలోని 8 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను తాళ్లపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణకు అందజేశారు. టీడీపీ, జనసేన నాయకుల అనుచిత వ్యాఖ్యలతో మనో వేదనకు గురై తాము రాజీనామా చేసినట్టు వారు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ మొత్తం 108 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాము మళ్లీ సేవలు అందజేస్తామని తెలిపారు.

మసీదులో వైఎస్సార్ సీపీ కరపత్రాల ఆవిష్కరణ



ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ముస్లిం నాయకులు

చాగల్లు: జిల్లా నుంచి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవాలని కొవ్వూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్కే యూసఫ్ షరీఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల ఎన్నికల ప్రచార కరపత్రాలను శుక్రవారం చాగల్లులోని మసీదులో ఆవిష్కరించారు. మసీదు పెద్ద మహ్మద్ అమర్ ఉల్లాబేగ్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, పార్టీ కొవ్వూరు మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగబాబు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్‌లోని 11కేవీ నల్లజర్ల ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు



వేగేశ్వరపురంలోని మేరీమాత ఆలయం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో గోదావరి నది ఒడ్డునే గల మేరీమాత పుణ్యక్షేత్రం మహోత్సవాలు శనివారం ప్రారంభమై నాలుగు రోజుల పాటు జరుగుతాయి. ఇందుకోసం పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి. జాన్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి ఉత్సవాలు మొదలవుతాయి. అఖండ జ్యోతి ప్రజ్వలనతో శనివారం ఉత్సవాలను ప్రారంభిస్తారు. జపమాల, మేరీమాత ఊరేగింపు, 29న జపమాల, దివ్యబలిపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 30న సమిష్టి దివ్య బలిపూజలో ఏలూరు పీఠాధిపతులు బిషప్ పొలిమెర జయరావు పాల్గొంటారు. హాజరయ్యే భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్టు జాన్ తెలిపారు.

డివిజన్‌లో తొమ్మిది నామినేషన్ల తిరస్కరణ

- కొవ్వూరులో రెండు, నిడదవోలులో మూడు, గోపాలపురం సెగ్మెంట్‌లో నాలుగు
- ముగిసిన నామినేషన్ల పరిశీలన



గోపాలపురంలో నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో సక్రమంగా లేని మొత్తం తొమ్మిది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. వాటిలో గోపాలపురంలో నాలుగు, నిడదవోలులో మూడు, కొవ్వూరు సెగ్మెంట్‌లో రెండు నామినేషన్లు ఉన్నాయి. కొవ్వూరు సెగ్మెంట్‌కు మొత్తం 28 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏడుగురు, ఐదుగురు స్వతంత్ర్య అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. వైఎస్సార్ సీపీ, టీడీపీల నుంచి డమ్మీగా వేసిన తలారి పరంజ్యోతి, ముప్పిడి సుజాతల నామిషన్‌లు తిరస్కరించినట్టు తెలిపారు. ప్రధాన అభ్యర్థులైన వైఎస్సార్ సీపీ నుంచి తలారి వెంకట్రావు, టీడీపీ నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావుల నామినేషన్‌లకు బీ-ఫారాలు అందడంతో ఆ రెండు పార్టీల నుంచి దాఖలైన రెండు డమ్మీ నామినేషన్లను తిరస్కరించినట్టు వివరించారు. పరిశీలన అనంతరం 12 మందికి చెందిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు.

గోపాలపురంలో..

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారంతో ముగియడంతో శుక్రవారం నుంచి నామినేషన్ పరిశీలన మొదలైంది. గోపాలపురం తహసీల్దార్ ఆఫీసులో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతి శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ జరిపారు. అభ్యర్థుల సమక్షంలో ఈ పరిశీలన జరిగింది. ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సరోచ్ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నామినేషన్ పత్రాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఒక వేళ ఏవైనా నామినేషన్లను తిరస్కరిస్తే అందుకు సహేతుకమైన కారణాలను వివరించాలని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిర్వహణ తీరును సూక్ష్మంగా పరిశీలించేందుకు సాధారణ ఎన్నికల పరిశీలకులం దవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, మే 12 వరకూ రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదులైనా నేరుగా వచ్చి అందజేయవచ్చున్నారు అలాగే ఫోన్ నంబర్ 8977935106కు కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

11 సక్రమం

అనంతరం నామినేషన్ల పరిశీలన వివరాలను రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి వెల్లడించారు. గోపాలపురం అసెంబ్లీ సెగ్మెంట్‌కు 15 నామినేషన్లు దాఖలు కాగా, పరిశీలన అనంతరం వాటిలో నాలుగింటిని తిరస్కరించినట్టు తెలిపారు. తహసీల్దార్ వనజాక్షి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.సువర్ణ, నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరిగింది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల సమక్షంలో నిడదవోలు రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్‌తో కలసి ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్ కాంత్ సరోచ్ స్క్రూటినీ జరిపారు. నామినేషన్ పరిశీలన అనంతరం వివరాలను రిటర్నింగ్ వెల్లడించారు. నిడదవోలు అసెంబ్లీ సెగ్మెంట్‌కు 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, పరిశీలన అనంతరం వాటిలో మూడు నామినేషన్లను తిరస్కరించినట్టు ఆయన తెలిపారు. ఈనెల 29 తేదీ మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుందన్నారు. అదే రోజున ఎన్నికల గుర్తులను కేటాయిస్తామని ఆర్వో పేర్కొన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. భానుప్రకాష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం దేవరపల్లి మండలం యర్నగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి యర్నగూడెం, ఆరు గంటల నుంచి త్యాజంపూడి గ్రామాల్లో ప్రచారం చేస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు చాగల్లు మండలంలో 'తలారి' ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు శనివారం చాగల్లు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ప్రజాశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఉదయం ఏడు గంటల నుంచి దారవరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి దారవరం, చంద్రవరం, మార్కొండపాడు, మల్లవరం, గౌరిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు. కావున నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం

కొవ్వూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీగణపతి ప్రింటింగ్ ప్రెస్ వద్ద శుక్రవారం మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిని దృష్టి ఉంచుకుని సేవాదృక్పథంతో ఈ చలి వేంద్రం ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, కార్యదర్శి పెనుమాక జయరాజు, కోశాధికారి ఉప్పులూరి రామకృష్ణ, పాలెంపాటి చినబాబు చౌదరి, గోలి వెంకటరత్నం, యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మన్యం బులిబాబు తదితరులు పాల్గొన్నారు.

వనితకు మద్దతుగా ఇంటింటా ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనితకు మద్దతుగా నాలుగు మండలాల్లో ఆ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. మే నెల 13న జరగుతున్న ఎన్నికల్లో మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తానేటి వనిత, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరుతున్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ బొంతా భరత్ బాబు ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. యాదవోలులో ఆచంట అనసూయ, ఆరేటి సూర్యనారాయణ, విసాకోడేటి కోటేశ్వరరావు, అనిశెట్టి సూర్యచంద్రరావు, అనిశెట్టి సర్వ శ్రీనివాస్, సూరి శివచంద్రరావు ఇంటింటి ప్రచారం చేశారు. దుద్దుకూరులో పార్టీ నాయకుడు నిమ్మగడ్డ కృష్ణ, పాపోలు రెడ్డిబాబు, లక్ష్మీపురంలో సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి, దోనెల్లి జానకీరాం, త్యాజంపూడిలో సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, పోతుల కృష్ణారెడ్డి ప్రచారం చేశారు.

జనసేన అభ్యర్థి ప్రచారం

నిడదవోలు: జనసేన పార్టీ నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్ శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. మద్దతుదారులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్ళి ఎన్నికల్లో గాజు గ్లాజు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వర్లు, రంగా రమేష్, తిరుపల్లి సత్యనారాయణ, కేదారిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబువి బూటకపు హామీలు.. నమ్మవద్దు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు సూచన
- కొవ్వూరు పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- బైక్ ర్యాలీతో యువకుల సందడి



కొవ్వూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చే బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచార రథంపై నుంచి శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే మండలంలోని మద్దూరు గ్రామంలో కూడా తలారి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినందున ఆయననే మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గతంలో ఎన్నికలపుడు చంద్రబాబు ఇచ్చిన ఓ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసగించిన విషయాన్ని ఓటర్లందరూ గుర్తుంచుకోవాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే అభ్యర్థి తనకు, మన ప్రాంతం వాడైన రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువకులు మోటార్ సైకిళ్లతో రెట్టించి ఉత్సాహంతో తలారి వెంకట్రావు ప్రచార రథానికి ముందు ర్యాలీ కొనసాగింది. ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, కౌన్సిలర్లు కంతమణి రమేష్‌బాబు, దేవగుప్తాపు చాందిని, బత్తి నాగరాజు, వరిగేటి లలితకుమారి, తోట లక్ష్మీప్రసన్న, మద్దిపట్ల సాయిగీత, పార్టీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, నాయకులు ఏలూరి వెంకట్, మాసా ఆనంద్, నగ్గళపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్, సూర్ల నగేష్, చొప్పా అప్పలనాయుడు, గంగాధర నాగేశ్వరరావు, కొడవటి దేవా, సొసైటీ అధ్యక్షుడు తోట నారాయణ, సంగీతం చిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

275 మందికి హోం ఓటింగ్ అవకాశం

నిడదవోలు: నియోజకవర్గంలోని 275 మందికి ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్టు నిడదవోలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గం మొత్తం మీద 85 ఏళ్ల వయసు పైబడిన 130 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారితో పాటు మంచానికే పరిమితమైన 145 మంది దివ్యాంగులకు కూడా ఇంటి వద్ద నుంచే ఓటింగ్ నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే వారందరికీ 12-డి ఫారాలు సరఫరా చేశామన్నారు. మే నెల ఆరో తేదీన వారందరికీ హోం ఓటింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గంలో 12 బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో బృందంలో ఒక గెజిటెట్ అధికారితో పాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, మైక్రో పరిశీలకుడు, వీడియోగ్రాఫర్, పోలీస్ సిబ్బంది కూడా ఉంటారన్నారు. ఇంటి వద్దకు వెళ్లేటపుడు ఎలక్షన్ సిబ్బంది ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌ను కూడా తీసుకుని వెళ్తారని తెలిపారు.

విపక్షాలను వీడి ఫ్యాన్ చెంతకు చేరి..



పెనకనమెట్టలో జనసేన, టీడీపీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి, రాజీవ్‌కృష్ణ

- పెనకనమెట్టలో టీడీపీ, జనసేనలకు 100 మంది గుడ్ బై
- వారంతా వైఎస్సార్ సీపీలో చేరిక
- ఆహ్వానించిన అభ్యర్థి తలారి, రాజీవ్‌కృష్ణ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రత్యర్థి శిబిరాలు ఖాళీ అవుతుంటే, వైఎస్సార్ సీపీ శిబిరం మాత్రం కళకళలాడుతోంది. మండలంలోని పెనకనమెట్టకు చెందిన జనసేన, టీడీపీల నుంచి వంద మందికి పైగా కార్యకర్తలు, నాయకులు ఆయా పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ తాడి వెంకటరెడ్డి (బాబ్జీ) ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వారంతా అధికార పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న రోజుల్లో పార్టీలో చేరిన వారంతా సమష్టిగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని వారిద్దరూ సూచించారు. పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తనూ గుర్తిస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో తాడి బుల్లిరాజు, కోడి వెంకన్న, దేవరకొండ రాంబాబు, వావిలాల సుబ్బారావు, పసలపూడి వీర్రాజు, దేశబత్తుల శ్రీనివాస్, మండపాటి నరసింహమూర్తి, బొమ్మల గోవింద్, కొలిశెట్టి భీమరాజు, కొడమంచిలి నాగచంద్రం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు కొలిశెట్టి దేవేంద్ర, ఉప్పులూరి సూరిబాబు, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, గారపాటి శ్రీనివాస్, గారపాటి వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో మంచి మార్పు



ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

- జగనన్న ఐదేళ్ల పాలనలో సాకారం
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత
- ద్వారకాతిరుమల మండలంలో ప్రచారానికి అనూహ్య స్పందన

దేవరపల్లి: ఐదేళ్ల జగనన్న పాలనలో పేద కుటుంబాల్లో మంచి మార్పు జరిగిందని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు, వేంపాడు, మెట్ట పంగిడిగూడెం, రాజా పంగిడిగూడెం, హనుమాన్‌గూడెం, సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఉదయం 8 నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కొనసాగాలన్నా, ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు చేరాలన్నా ఈ నెల 13న జరుగుతున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కూటమి పేరుతో ప్రజలను మోసగించేందుకు వస్తున్న చంద్రబాబు కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. మంత్రి వనితకు గ్రామాల్లో అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రచారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు, బొండాడ వెంకన్నబాబు, ఆయా పంచాయతీల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తలారికి మద్దతుగా కుమార్తె ప్రచారం



తలారి వెంకట్రావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తె షాలిని

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు మద్దతుగా ఆయన కుమార్తె షాలిని మండలంలోని వేగేశ్వరపురంలో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, ఆ పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేసి తన తండ్రిని, పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సామాన్యుడు, కష్టం విలువ తెలిసిన తలారి వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తారని, అందరికీ అందుబాటులో ఉంటారని ఆమె అన్నారు. ప్రచారంలో పెండ్యాల మమత, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.దమయంతి, నాయకులు శీర్ల బ్రహ్మానందం, నున్న కృష్ణ, శూలా పోశియ్య, ఎం.గనిరాజు, వీరబాబు, పోతిరెడ్డి విష్ణురావు, ఉప సర్పంచ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే ఇంటికే సంక్షేమం

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- వైఎస్సార్ సీపీ తరఫున విస్తృతంగా ప్రచారం



నిడదవోలు 5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు

నిడదవోలు: సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా పట్టణంలోని 5వ వార్డులో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి సహకరించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మండలంలో పల్లారావు ఆధ్వర్యంలో..

నిడదవోలు రూరల్: సంక్షేమ పథకాలు ముంగిట్లోకి రావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేసి మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, గోపవరం, పందలపర్రు, తాళ్లపాలెం, కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడులకు మద్దతుగా పార్టీ శ్రేణులు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశాయి. ఓటర్లకు కరపత్రాలు అందజేసి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, అంబటి గోపమ్మ, ఎంపీటీసీ సభ్యులు పడాల రంగారావు, బయ్యే కృష్ణబాబు, కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, గంధం వెంకటరత్నం, వింతా గంగాధర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల తరఫున జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు శుక్రవారం ఉండ్రాజవరంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి శ్రీనివాస్‌నాయుడిని ఎమ్మెల్యేగా, గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేయండి



రోడ్డు కమ్ రైలు వంతెన వద్ద పోలీసు చెక్ పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న బలరామ్ మీనన్

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రోడ్డు కం రైలు వంతెన వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టు చెక్‌పోస్టును జిల్లా పోలీసు పరిశీలకుడు బలరామ్ మీనన్ శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీ నిష్పాక్షికంగా, క్షుణ్ణంగా చేయాలని సూచించారు. అనంతరం కొవ్వూరులోని సంస్కృత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ గార్డ్‌తో మాట్లాడారు. డీఎస్పీ కేసీహెచ్ రామారావు, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఇతర సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

వేగేశ్వరపురంలో చెక్ పోస్టు ఏర్పాటు

తాళ్లపూడి: ఎన్నికల నిఘాలో భాగంగా వేగేశ్వరపురంలోని గోదావరి మేరీమాత ఆలయం వద్ద పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్టు ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తెలిపారు. మండల సర్వేలెన్స్ బృందం శుక్రవారం ఇక్కడ తనిఖీలు నిర్వహించింది. పరిమితికి మించి లెక్కలు లేకుండా వాహనాల్లో నగదు తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని ఎస్సై తెలిపారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకు వెళ్లరాదన్నారు. సిబ్బందితో పాటు తాళ్లపూడి పంచాయతీ కార్యదర్శి ఆశాలేఖ్య కూడా ఉన్నారు.



